క్లుప్తంగా

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నారీ సంఘం సభ్యులు

బోట్‌క్లబ్: ప్రగతి నారీ సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక శాంతినగర్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక మహిళలు ఎంతో ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొని తెలుగుదనం ఉట్టిపడేలా ముగ్గులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షురాలు పి.వరలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకూ సంఘం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో మద్యపాన నిషేధం అమలు చేయాలన్నారు. అనంతరం ముగ్గులు పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు వి.మంగ, బి.పద్మ, ఆర్.పద్మ, రమ్యసాయి, సునీత దివ్య పాల్గొన్నారు.

రేపు సౌండ్ సిస్టం యజమానుల సమావేశం

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లాలో సౌండ్ సిస్టం ఓనర్స్, హెల్పర్స్‌తో ఏర్పాటు చేసిన సంఘాల సమస్యలపై శనివారం కాకినాడ రెవెన్యూ కాలనీ సిటీ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ హాలు వద్ద సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్టు సంఘం నాయకులు కుక్కల గనిరాజు, నడికట్ల లోవరాజు, పెంకే మారయ్య తెలిపారు. గురువారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ఒకే ధరను అమలు చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఈ సంఘంలో ఉన్న సభ్యులకు ప్రమాదం జరిగితే వారికి అండగా ఉండే విధంగా జిల్లా అసోసియేషన్ అండగా నిలుస్తుందన్నారు. సర్వసభ్య సమావేశంలో తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు. సమావేశం అనంతరం నూతన కమిటీని ఎన్నుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇందన మాణిక్యాల రావు, డి.రాజురెడ్డి, గని నాగేశ్వరరావు, వడ్డి రాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓ ఉద్యోగ విరమణ సభ



సీహెచ్‌ఓ రత్నకుమారిని సత్కరిస్తున్న ఎంపీపీ, సర్పంచ్ తదితరులు

కరప: స్థానిక పీహెచ్‌సీలో పనిచేసిన సీహెచ్‌ఓ ఎడ్ల రత్నకుమారి పదవీ విరమణ సభ గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ తదితరులతో కలసి రత్నకుమారిని సత్కరించారు. అనంతరం పీహెచ్‌సీ డాక్టర్ యాంజలిన్, సిబ్బందితో కల్సి, సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కరప, కాజులూరు, తాళ్లరేవు, పెదపూడి మండలాల వైద్యసిబ్బంది రత్నకుమారిని ఘనంగా సన్మానించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి జన్మనక్షత్ర పూజలు



వేంకటేశ్వరస్వామికి జన్మనక్షత్ర పూజలు, వ్రతాలు చేయిస్తున్న అర్చకుడు

కరప: మండలం యండమూరులో వేంచేసిన సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామి జన్మనక్షత్రం శ్రవణం కలియడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామం పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులతో వెంకటేశ్వరస్వామి వ్రతాలు నిర్వహించారు. యండమూరు, పరిసర గ్రామాల నుంచి భక్తులు వచ్చి, వ్రతాలు చేయించుకుని, స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కరప విష్ణాలయంలోని వేంకటేశ్వరస్వామికి అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు, కూరాడ, పెనుగుదురు, గురజనాపల్లి, వేళంగి తదితర గ్రామాల్లోని వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో స్వామి వారికి జన్మనక్షత్ర పూజలు చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కాకినాడ రూరల్: ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పంతం నానాజీ గురువారం పంపిణీ చేశారు. గుడారిగుంటలోని కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని 14 మంది లబ్ధిదారులకు సుమారు రూ.14 లక్షల విలువైన చెక్కులు అందించారు.


అవును.. ఇవి ప్రభుత్వ భవనాలే!

- మొలిచిన మొక్కలే అందుకు సాక్ష్యం
- కనీస నిర్వహణకూ నోచుకోని పరిస్థితి
- బయటా, లోపలా అదే అధ్వానం

శిథిల భవనాలు.. పెచ్చులూడుతున్న శ్లాబ్‌లు.. బయటపడుతున్న ఇనుప ఊచలు.. గోడలపై మొలుస్తున్న పిచ్చిమొక్కలు.. వర్షాలకు తడుస్తున్న రికార్డులు.. ఇదీ జిల్లాలోని చాలా ప్రభుత్వ కార్యాలయ భవనాల పరిస్థితి. ఎన్నో ఏళ్ల కిందట నిర్మాణాలు చేపట్టినవి కావడంతో శిథిలమై ఉద్యోగులను కలవరానికి గురి చేస్తున్నాయి. కొన్ని కార్యాలయాల్లో ఫ్యాన్ల కింద విధులు నిర్వహించాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. అక్కడకు పలు పనులపై వచ్చే ప్రజలు భవనాల పరిస్థితి చూసి భయపడిపోతున్నారు. శిథిలావస్థకు చేరినప్పటికీ ఎవరికీ పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో అధికారులకే దిక్కులేకుంటే తమకేం పరిష్కారం చూపుతారని ప్రజలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.



కలెక్టరేట్‌లోని జలభవన్ శ్లాబ్‌పై మొలిచిన మొక్కలు



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం భవనం గోడపై పెద్ద కాండంగా మారుతున్న మొక్క..

కాకినాడ లీగల్: అది జిల్లా కలెక్టరేట్‌లోని జలభవన్. పర్యవేక్షణలేకపోవడంతో రావిచెట్లు, వేప మొక్కలు పెరిగిపోయి భవనం గోడలు బీటలు వారుతున్నాయి. దీంతో పాడుబడి వదిలేసిన భవనంలా కనిపిస్తోంది. తహసీల్దార్ కార్యాలయం భవనంపై వివిధ రకాల మొక్కలు పెరిగిపోవడంతో భవనం శ్లాబ్‌లు, గోడలు బీటలు వాడంతో వర్షాకాలంలో కార్యాలయంలోకి నీళ్లు కారిపోయి ఫర్నిచర్, ఫైళ్లు పాడైపోతాయని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. అయితే ప్రభుత్వానికి అధిక ఆదాయాన్ని చేకూర్చే జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని కనీసం పట్టించుకోవడం లేదు. కార్యాలయంపై పిచ్చి మొక్కలు పెరిగిపోవడం, కనీస నిర్వహణ లేకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరిట్టు కనిపిస్తోంది. పీఆర్ కళాశాలకు వివిధ రూపాలలో ఆదాయం వస్తున్నప్పటికీ కళాశాల భవనాల నిర్వహణ లేకపోవడంతో మొక్కలు పెరిగిపోతున్నాయి. దీంతో భవనాలు శిథిలమవుతున్నాయని పూర్వ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.



పీఆర్ కళాశాల భవనంపై ఎక్కడ పడితే అక్కడ..



తహసీల్దార్ కార్యాలయ భవనంపై..

ప్రభుత్వ భవనాల పర్యవేక్షణ చేయాలి



కోట్లాది రూపాయలతో నిర్మించే ప్రభుత్వ భవనాలు కనీస పర్యవేక్షణ లేకపోవడంతో అధ్వానంగా తయారవుతున్నాయి. సుమారు 40 నుంచి 50 ఏళ్ల వరకు ఉండాల్సిన భవనాలు పది పదిహేనేళ్లకే శిథిలావస్థకు చేరుతున్నాయి. దీనిపై అధికారులు దృష్టి సారించి ప్రభుత్వ భవనాలను నిత్యం పర్యవేక్షిస్తూ చిన్నచిన్న మరమ్మతులు చేయించడం వంటివి చేయాలి.

జీఎస్ఆర్ కృష్ణారావు

మొక్కలు తొలగించండి



ప్రభుత్వ కార్యాలయాలపై అడ్డదిడ్డంగా పెరిగిపోయిన మొక్కలను తొలగించాలి. మొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో భవనాలు శిథిలమవుతున్నాయి. దీంతో భవనాలు పాడైపోవడంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించే సమయంలో అసహనానికి గురవుతున్నారు. భవనాలపై మొక్కలు తొలగించాల్సిన అవసరం ఉంది.

ఎస్‌వీవీ రమణ

కన్నబాబు పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కన్నబాబు తదితరులు

కరప: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు స్థానిక నాయకులతో కల్సి కరపలో గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయ పాలకమండలి సభ్యుడుగా పనిచేసిన చాగంటి సూరిబాబు తల్లి విశ్రాంత హిందీ పండిట్ చాగంటి ప్రభావతి ఇటీవల గుండెపోటుతో మరణించారు. స్థానిక నాయకులతో కలసి చాగంటి సూరిబాబు ఇతర కుటుంబసభ్యులను కన్నబాబు పరామర్శించి, సంతాపం తెలియజేశారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కురసాల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సాదే లోహిదాస్, నక్కా సత్తిబాబు, కర్రి చక్రధర్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

శ్రీకృష్ణునిగా సీతారామయ్య



బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రతమహోత్సవాలు, రజిత దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న సీతారామస్వామి గురువారం కృష్ణావతారంలో భక్తులకు దర్శన మిచ్చారు. స్వామి వారికి ఉదయం అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొన్నారు.

వైభవంగా అన్నకూటోత్సవం



అన్నకూటోత్సవాన్ని దర్శించుకుంటున్న మాజీ మంత్రి కురసాల కన్నబాబు, కుటుంబ సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా గురువారం అన్నకూటోత్సవం నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి ఆలయ మండపంలో ఆలయ కమిటీకి చెందిన ఆకుల రాజబాబు, దంపతుల సహకారంతో పులిహోర వెంకటేశ్వరస్వామిని ఆలయ అర్చకుడు పవన్‌కుమార్ బృందం తయారు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారిని భక్తులకు దర్శనాలకు అనుమతించారు. వేలాదిగా భక్తులు సాక్షాత్తు వెంకటేశ్వరస్వామిని తలపించేలా అన్న కూటోత్సవంతో తయారు చేసిన స్వామి వారిని చూసి తరించారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు దంపతులు, కురసాల సత్యనారాయణ, వాసిరెడ్డి ఏసుదాసు తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద నిర్వహించిన భారీ అన్నదానంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ-1 బుల్లి కృష్ణవేణి

కరప: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి విద్యార్థికి అందించడంతో పాటు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)లు కృషిచేయాలని ఎంఈఓలు కె.బుల్లి కృష్ణవేణి, పి.సత్యనారాయణ సూచించారు. మండలం పెద్దాపురప్పాడులోని బిరుదా సూర్యనారాయణ (ఫకీర్రావు) జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మండలస్థాయిలో ఏర్పాటు చేసిన 65 పాఠశాలల నుంచి ఒక ఉపాధ్యాయుడు, ఒక ఎస్ఎంసీ సభ్యుడు వంతున పాల్గొనగా వారికి ఒకరోజు శిక్షణా నిర్వహించి, ఎంఈఓలు మాట్లాడారు. విద్యార్థుల డ్రాపవుట్స్ తగ్గించి, బడిలో విద్యార్థుల హాజరు పెంచాలన్నారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించేలా, నాణ్యతా ప్రమాణాలతో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టేలా ఎస్ఎంసీలు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన రీసోర్స్‌పర్సన్లు వి.రామ్మోహన్, సీహెచ్‌వీ రామకృష్ణ, డి.లక్ష్మి, ఎ.మంగాదేవి, ఎల్.దివ్య ఎస్ఎంసీల విధులు, బాధ్యతలను వివరించి, చేయాల్సిన విధివిధానాలపై శిక్షణ ఇచ్చారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు తమ పాఠశాలలో ఈ నెల ఆరో తేదీన మిగిలిన సభ్యులకు శిక్షణ ఇస్తారని ఎంఈఓలు తెలిపారు. హెచ్ఎం ఎస్ఎస్ఎస్ శ్రీనివాసరావు, సీఆర్పీలు పలకా రాజు, పి.సత్యనారాయణ, జి.సారాకుమారి, పి.సునీత, వై.నాగలక్ష్మికుమారి, బి.సుజాత పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా మాండవ్య నారాయణుని కల్యాణం



సామర్లకోటలో సాగుతున్న స్వామివారి కల్యాణం

సామర్లకోట: అతి పురాతన విష్ణు ఆలయమైన మాండవ్య నారాయణస్వామి కల్యాణం గురువారం అత్యంత వైభవంగా నేత్ర పర్వంగా జరిగింది. ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గత నెల 16 నుంచి పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. భీమవరం తుల్య గోదావరి తీరాన వేంచేసి యున్న శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్య నారాయణస్వామిని దర్శించుకోవడం వలన మంచి ఫలితాలు లభిస్తాయని భక్తుల నమ్మకం. ఈ మేరకు స్వామి వారి కల్యాణం తిలకిస్తే మరింత మంచి ఫలితాలు లభిస్తాయనే నమ్మకంతో అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించడానికి వచ్చారు. ఇండిగ దుర్గాప్రసాద్ దంపతులు పీటపై కూర్చుని కల్యాణం చేశారు. ఆలయ అర్చకులు రఘురామ్ ఆచార్యులు, రవికుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకాలకు, లక్ష తులసి పూజ, అమ్మవార్లకు లక్ష సింధూర పూజ, ఆంజనేయస్వామి వారికి లక్ష తమల పాకుల పూజలు, హోమం జరిగాయి. 13వ తేదీ భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం గోదా కల్యాణంతో ధనుర్మాస పూజలు ముగియనున్నాయి. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

పుస్తక పఠనంతో జ్ఞానం



విద్యార్థికి పుస్తకాలు అందజేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ మురళీకృష్ణ

- జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రస్తుత యుగంలో యువత మొబైల్‌కు అలవాటు పడి పుస్తక పఠనాన్ని తగ్గించారని, గ్రంథాలయాలను సందర్శించి మంచి పుస్తకం చదవడం ద్వారా జ్ఞానం పెంపొందించుకోవచ్చని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూ ప్రధాన గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఫ్రీబుల్ ద బుక్ బఫే కార్యక్రమం ప్రారంభించి మాట్లాడుతూ ఫ్రాన్స్ దేశంలో ఓపెన్ లైబ్రేరీని ఆదర్శంగా తీసుకుని దీనిని ఏర్పాటు చేశామని, నగర ప్రముఖులు, అధ్యాపకులు అందజేసిన పుస్తకాలు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గ్రంథాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి శనివారం ఉదయం 11 గంటల నుంచి 12.30 వరకూ తమకు నచ్చిన పుస్తకాలను ఉచితంగా తీసుకుని మిగిలిన రోజుల్లో చదువుకునేందుకు తీసుకెళ్లవచ్చన్నారు. పుస్తకాలు లేని భవన సముదాయానికి చక్రవర్తిగా ఉండటం కంటే పుస్తకాలు ఉన్న పూరి గుడిసెకు కాపలాదారునిగా ఉండడమే సంతోషమన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్ర, మాజీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, ప్రిన్సిపాల్ మోహనరావు పాల్గొన్నారు.

ఐఏపీటీలో విద్యార్థుల ప్రతిభ

బాలాజీచెరువు: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఏపీటీ) లెవెల్-1 పోటీలలో శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ చూపారు. విద్యార్థులు బేహరోజ్ మహ్మద్, వోలేటి వరుణ్ సముద్ర వర్మ ప్రతిభ చూపి అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఏజీఎం సురేష్, ఆర్ఐ గోపీనాథ్, ప్రిన్సిపాల్ రాఘవేంద్ర అభినందించారు.

బీచ్‌లో ప్రమాదాలపై అవగాహన



బీచ్ వద్ద జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ సూర్యాపేట బీచ్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో సందర్శకులకు ప్రాణాల విలువ తెలిసేలా మెరైన్ పోలీసులు గురువారం అవగాహన కల్పించారు. బుధవారం ముగ్గురు యువకులు సముద్రంలో గల్లంతై మృతి చెందడంతో అప్రమత్తమైన పోలీసులు సూర్యాపేటలోని ఓల్డ్, న్యూ బీచ్‌లో పహారా కాశారు. సముద్రం లోపలికి సందర్శకులను అనుమతించలేదు. ప్రమాదాల నివారణకు సందర్శకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు ఉన్న సిబ్బందితో పాటు అదనంగా మరికొంత సిబ్బందిని బీచ్ వద్ద పహారాకు నియమించినట్టు రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో పోలీసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ మండల సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు

ఎంపీడీఓ	పసుపులేటి సతీష్	98481 83847		
ఎంపీపీ	బందిలి వీరీష	88977 14834		
గ్రామం	ప్రత్యేక అధికారి/సర్పంచ్		కార్యదర్శి	
రమణయ్యపేట	కేఎస్ వరప్రసాద్	91544 09525	జె.నరసింహరావు	98483 33678
వాకలపూడి	కేఎస్ వరప్రసాద్	91544 09525	పి.పాండురంగారావు	98857 63592
వలసపాకల	జి.శ్రీనివాసరావు		ఆర్ఎస్ఎస్ మూర్తి	94404 11936
ఇంద్రపాలెం	ఎస్ఆర్ ఆంజనేయులు	94921 60499	ఎం.శివప్రసాద్	98497 48720
చీడిగ	పసుపులేటి సతీష్	98481 83847	బి.గోవిందరాజులు	99599 94646
తూరంగి	జి.శ్రీనివాసరావు	77022 99660	జేవీ రమణమ్మ	99516 72981
గంగనాపల్లి	గీసాల మహాలక్ష్మి	91606 99909	కర్రి శ్రీనివాసరావు	99495 63418
కొవ్వాడ	కోటిపల్లి ఉమ	99660 97456	జి.చిరంజీవి	99127 77608
కొవ్వూరు	పిల్లి చక్రరావు	98483 98161	ముత్యాల వరలక్ష్మి	98496 52455
నేమాం	రామదేవు సూర్యప్రకాశరావు	97053 89099	ఎల్‌వీఎల్ దేవి	99086 74433
పండూరు	వలవల అమ్మాజీ	98487 54599	ఎం.రామమోహన్‌చౌదరి	93918 30892
పి.వెంకటాపురం	పెంకే లక్ష్మి	99089 09820	ఎండీ స్వస్థల షరీఫ్	89770 61120
పెనుమర్తి	పెంకే ఆనందకుమార్	78935 76090	చిక్కాల వెంకటరమణ	79931 12114
రేపూరు	నక్కా వీరన్న	99482 91614	కె.విజయ ఝాన్సీ	83175 22877
సర్పవరం	శీలం నాగేశ్వరరావు	98487 43953	పి.శ్రీనివాస్	98666 89968
సూర్యారావుపేట	సూరాడ చిన్నీ	99126 71919	ఎల్‌వీఎల్ దేవి	63035 74042
తమ్మవరం	గొల్లపల్లి రామస్వామి	98499 98334	బి.రాజేంద్రకుమార్	80088 15021
తిమ్మాపురం	బీవీవీ సత్యనారాయణ	98484 43334	ఎస్.నాగఫణిబాబు	99086 74433

రహదారులను సకాలంలో పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ షణ్మోహన్
- అధికారులతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రులు, రహదారుల పరిశీలన



వేములపాలెంలో రహదారిని పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

ప్రత్తిపాడు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన రోడ్ల పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ప్రత్తిపాడు మండలంలోని ప్రత్తిపాడు, వేములపాలెం, పెద్దిపాలెం, ఉత్తరకంచి గ్రామాల్లో మంగళవారం కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటన చేశారు. తొలుత ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం లంపకలోవ మీదుగా వేములపల్లి చేరుకుని గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలను పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించి, నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం పెద్దిపాలెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, వార్డులు, మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు పరిశుభ్రపరాచాలన్నారు. ఉత్తరకంచిలో పల్లె పండుగ పంచాయతీలో భాగంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతి దినం సక్రమంగా పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో ప్రత్తిపాడు మండలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారని, మండలానికి సంబంధించి వివిధ గ్రామాలను ఆనుకుని ఉన్న గిరిజన ఆవాసాలకు అనుసంధానంగా ఉన్న ప్రాంతాలలో బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. ప్రధానంగా గోకవరం, లంపకలోవ నుంచి రౌతుపాలెం, వేములపాలెం, పెద్దిపాలెం నుంచి ఉత్తరకంచి ఉన్న గ్రామాల్లో రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. కలెక్టర్ వెంట డీసీహెచ్ఎస్ డా.ఎస్.స్వప్న, ప్రత్తిపాడు సీహెచ్‌సీ వైద్య అధికారి డా.డి.సౌమ్య, తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ సీహెచ్ రత్నం రాజు, పెద్దిపాలెం పీహెచ్‌సీ వైద్య అధికారి డా.యశస్వీ కొండేపూడి, ఏపీఓ కుమారస్వామి, ఏపీఎం వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్